క్లుప్తంగా

టీడీపీ నేతలపై కేసులు

కుప్పం: పట్టణంలో మంగళవారం అనుమతి లేకుండా రోడ్డుపై ఆందోళనచేసి, శాంతి భద్రతలకు విఘాతం కలిగించారని టీడీపీ నేతలపై కుప్పం అర్బన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అంతేకాకుండా నిలువరించేందుకు యత్నించిన పోలీసులపై తిరగబడిన 60మంది టీడీపీ కార్యకర్తలపై 341, 353, 506, 143,149 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు అర్బన్ ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు.

షాదీఖానాకు బోరుమోటారు వితరణ



బోరుమోటారు అందజేస్తున్న మొగసాల కుటుంబీకులు

బైరెడ్డిపల్లి: స్థానికల్లె షాదీఖానాకు మొగసాల కుటుంబీకులు బుధవారం బోరు మోటారును వితరణగా అందజేశారు. రాజంపేట ఎన్నికల పరిశీలకులు బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి, ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప మాట్లాడారు. షాదీఖానా అభివృద్ధికి తమవంతు సాయంగా ఈ వితరణ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేష్, వైస్ సర్పంచ్ తబ్రాజ్, సచివాలయ కన్వీనర్ షాకీర్, సోషల మీడియా కో–కన్వీనర్ పీరూసాబ్, బషీర్ సాబ్, షబ్బీర్, ఆజాద్, లియాఖత్ పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

గంగవరం: అక్రమ మద్యం రవాణా కేసుల్లో సీజ్ చేసిన నాలుగు ద్విచక్ర వాహనాలు, 1 కారును గురువారం బహిరంగ వేలం వేయనున్నట్లు ఎస్‌ఐ ప్రతాపెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు వేలం నిర్వహిస్తామని, ఆసక్తి కలవారు నిర్ణీత రుసుం చెల్లించి పాల్గొనవచ్చన్నారు.

సర్పంచ్ కృష్ణారెడ్డికి ఘన సన్మానం



సర్పంచ్ కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

చౌడేపల్లి: పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా ఉత్తమ పంచాయతీగా లద్దిగం సర్పంచ్ కృష్ణారెడ్డికి అవార్డు రావడం ఆనందంగా ఉందని గ్రామస్తులు తెలిపారు. బుధవారం గ్రామ సచివాలయంలో సర్పంచ్‌ను గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది కలిసి శాలువతో సన్మానించి సత్కరించారు. నేతలు కృష్ణమోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి జాకీర్ హుస్సేన్, దొరబాబు వలంటీర్లు, వార్డుమెంబర్లు ఉన్నారు.

కల్లూరు సర్పంచ్‌కు...



సర్పంచ్ షుకూర్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

పులిచెర్ల(కల్లూరు): మేజర్ పంచాయతీ కల్లూరుకు ఉత్తమ పంచాయతీ అవార్డు రావడంలో సర్పంచ్ షుకూర్ కృషి మరువలేనిదని ఈఓ యుగంధర్ అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఈఓతో పాటు పంచాయతీ, సచివాలయ సిబ్బంది ఆయనను సన్మానించారు.

13న లోక్ అదాలత్

పలమనేరు: వచ్చే నెల 13న నిర్వహించనున్న లోక్ అదాలత్‌లో పలమనేరు మున్సిపాలిటీలోని పెండింగ్ కేసులను రాజీ చేసుకునే అవకాశం ఉంటుందని సీనియర్ సివిల్‌జడ్జి శ్రీనివాసరావు సూచించారు. బుధవారం స్థానిక కోర్టులో మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, అధికారులకు లోక్ అదాలత్ సేవల గురించి జడ్జి వివరించారు. లోక్ అదాలత్‌లో సెటిల్ అయిన కేసులకు అప్పీలు చేసుకునే అవకాశం ఉండన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చల్లావారిపల్లెలో చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎంపీపీ సురేంద్రనాథ రెడ్డి

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని చల్లావారి పల్లె, కొత్తపేటల్లో బుధవారం ఎంపీపీ సురేంద్ర నాథ రెడ్డి చలివేంద్రాలను ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి ఆయా గ్రామాల కూడలిలో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. నాదమునిరెడ్డి, సైపుల్లా, చంద్రశేఖరరెడ్డి, సంతోష్, సదాశివరెడ్డి, గోవిందరెడ్డి, ఎస్‌వీ రమణ, షకీల్, రాజమూర్తి, కృష్ణమూర్తి, సురేంద్ర, ఆనంద ఎంపీడీఓ సుగుణమ్మ పాల్గొన్నారు.

గొట్టిగంటివారిపల్లెలో చోరీ

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని గొట్టిగంటివారిపల్లెలో లక్ష్మీపతినాయుడు ఇంట్లో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. వివరాలు.. లక్ష్మీపతినాయుడు కుటుంబ సభ్యులు మంగళవారం రాత్రి ఇంటిలో దిండు కింద బీరువా తాళాలను పెట్టుకుని నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి దాటిన తరువాత దొంగలు ఇంటిలోకి ప్రవేశించారు. దిండు కింద ఉన్న తాళాలను తీసుకుని బీరువాలోని 80 గ్రాముల బంగారం చోరీ చేశారు. ఉదయం చోరీ జరిగిన విషయం లక్ష్మీపతి గుర్తించారు. సుమారు రూ.2.40 లక్షల బంగారు చోరీ జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సీఐ ఆశీర్వాదం, ఎస్‌ఐ రవిప్రకాష్‌రెడ్డి, క్లూస్ టీం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి

–ఎమ్మెల్యే వెంకటేగౌడ



సంక్షేమ పథకాల బుక్‌లెట్లను లబ్ధిదారులకు ఇస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

వి.కోట: వేసవిలో రోజు రోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, గ్రామాల్లో దాహార్తి బాధలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వెంకటేగౌడ అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని ముదరం దొడ్డి, గూబలబండ, ముదరందొడ్డిలో ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. దాదాపు 633 గృహాలకు వెళ్లి ప్రజలతో ఆయన మాట్లాడారు. ఆయా కుటుంబాలు పొందిన సంక్షేమ పథకాల లబ్ధిని బుక్‌లెట్లతో వారికి తెలియజేశారు. గ్రామస్తులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సంబంధిత అధికారులు పరిష్కరించాలని సూచించారు.

టీడీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజల్లో లభిస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు, ఎల్లోమీడియా ప్రభుత్వంపై చేస్తున్న దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలతో పేదల కుటుంబాల్లో వెలుగులు పూశాయని, నవరత్నాలే దీనికి ఉదాహరణ అని ఆయా పథకాలను ఉదహరించారు. ఇవన్నీ టీడీపీకి చెంపపెట్టు అని చెప్పారు. సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు సమన్వయంతో కృషి చేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ యువరాజ్, వైస్ ఎంపీపీ లక్ష్మణ్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ గోపిరెడ్డి, పంచాయతీ సర్పంచ్ దామోదరం, ఎంపీటీసీ ఫజిల్లా, రాజరత్నమ్మ, రెస్కో డైరెక్టర్ భూపతి, ఏఎంసీ డైరెక్టర్ నారాయణ, పంచాయతీ కన్వీనర్ రాధాకృష్ణ, నాయకులు సెట్, ప్రభాకర్‌రెడ్డి సచివాలయ కన్వీనర్లు, పంచాయతీ అధికారులు, నాయకులు, యువత పాల్గొన్నారు.

ఘనంగా పెద్దపులి గంగమ్మ జాతర
–మొక్కులు చెల్లించిన ఎమ్మెల్యే వెంకటేగౌడ



అమ్మవారి జాతరలో ఎమ్మెల్యే వెంకటేగౌడ, నాయకులు

గంగవరం: మండలంలోని పత్తికొండలో బుధవారం పెద్దపులి గంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. జిల్లాలో మొట్ట మొదటిగా పుంగనూరు సుగుటూరు గంగమ్మ జాతర అనంతరం పత్తికొండలో, ఆ తర్వాత పలమనేరులో జాతర నిర్వహించడం పరిపాటి. మంగళవారం రాత్రి డప్పులు, బాణ సంచా మోత నడుమ అమ్మవారి శిరస్సును గ్రామ వీధుల్లో ఊరేగించి కొలువుదీర్చారు. బుధువారం వేకువ జాము నుంచి జాతర కోలాహలం మొదలైంది. భక్తులు పెద్దసంఖ్యలో వచ్చారు. జాతర సంబరాలకు ఎమ్మెల్యే హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. గ్రామస్తులు ఆయన్ను సత్కరించి అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, సర్పంచ్ రవినాయుడు, ఎంపీటీసీ సూరిబాబు, నాయకులు చంద్రప్ప, గిరిరాజారెడ్డి, సిద్ధప్ప తదితరులు పాల్గొన్నారు.

పిల్లల నమోదుకు ప్రత్యేక ఆధార్ కేంద్రం



ఆధార్ నమోదుపై మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస విశ్వనాథ్

పెద్దపంజాణి: పెద్దపంజాణి గ్రామ సచివాలయ పరిధిలో గురువారం ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ టి.శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. ఆధార్ నమోదుపై బుధవారం తన కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. మండలంలో ఐదేళ్లలోపు పిల్లలు 3947 మంది ఉన్నారని, వారిలో 2705 మంది మాత్రమే ఆధార్ నమోదు చేసుకున్నారన్నారు. నమోదు చేసుకోని 1242 మంది చిన్నారుల కోసం ఈ ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆధార్ నమోదుకు వచ్చేవారు తప్పనిసరిగా పిల్లల జనన ధ్రువీకరణ పత్రం, తల్లిదండ్రుల ఆధార్ కార్డు తీసుకురావాలని చెప్పారు. కొత్తగా ఆధార్ నమోదు, ఉన్న ఆధార్ కార్డులో సవరణలు చేసుకునే వారు సైతం దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీఎస్ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణపై అవగాహన



మామిడి తెగుళ్లపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సదుం: రైతులకు మామిడి, టమాట పంటల్లో తెగుళ్ల నివారణపై కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు బుధవారం అవగాహన కల్పించారు. ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం, వాటర్‌షెడ్ ఆధ్వర్యంలో స్థానిక సీఎల్‌ఆర్‌సీ భవనంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా టమాటాలో సూది పురుగు, ఆకుముడత, బ్యాక్టీరియల్ తెగుళ్ల సమగ్ర సస్యరక్షణ ద్వారా నివారణ పద్ధతులను డాక్టరు పీరూసాహెబ్ తెలియజేశారు. మామిడిలో ఆశించే తేనెమంచు, తామర, కాయతొలుచు పురుగు, తెగుళ్ల నివారణను క్షేత్రస్థాయిలో వివరించారు. కల్తీ లేని ఆహారంపై డాక్టరు సుధారాణి తెలియజేశారు. కార్యక్రమంలో వాటర్‌షెడ్ పీఓ శోభారాణి పాల్గొన్నారు.

స్కూళ్లకు డెస్కులు మంజూరు



ప్రభుత్వ పాఠశాలలకు చేరిన డెస్కులు

రొంపిచెర్ల: మండలంలో నాడు–నేడు పథకంలో రెండవ విడత పనులు జరుగుతున్న స్కూళ్లకు ప్రభుత్వం డెస్కులు మంజూరు చేసిందని ఎంఈఓ హసన్‌బాషా తెలిపారు. ఆయన బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నాడు–నేడు పథకంలో రెండవ విడత 8 ప్రభుత్వ స్కూళ్లను ఎంపిక చేసిందన్నారు. ఈ పాఠశాలలో అదనపు తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. 556 మంది విద్యార్థులకు 278 డెస్కులు వచ్చాయన్నారు. సర్కార్ స్కూళ్ల రూపురేఖలు మారుతున్నాయని తెలిపారు. ఒక రొంపిచెర్ల ఆదర్శ స్కూల్‌కు 138 డెస్కులు వచ్చాయన్నారు. ప్రభుత్వం పేద విద్యార్థులకు క్వాలిటీ కలిగిన ఫర్నీచర్‌ను స్కూళ్లకు ఇచ్చిందన్నారు. పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ కోరారు.

డ్యూయల్ పర్పస్ టమాట సాగు పెంచండి

–ఉద్యానశాఖ కమిషనర్ శ్రీధర్



డ్యూయల్ పర్పస్ టమాట పంటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ కమిషనర్ శ్రీధర్

పలమనేరు: సాంప్రదాయ పద్ధతుల్లో సాగుచేసే టమాటాకు బదులు రెండు విధాలా ఉపయోగపడే డ్యూయల్ పర్పస్ టమాట రకాలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని ఉద్యానశాఖ కమిషనర్ శ్రీధర్ సంబంధిత అధికారులకు సూచించారు. మండలంలోని మొరం పంచాయతీ కురప్పల్లె వద్ద రైతు వెంకటరమణ సాగుచేసిన రెండు విధాలా లాభదాయకమైన 6246,అనోల్స్ అనే కొత్త రకాలైన టమాట పంటను బుధవారం ఆయన పరిశీలించారు. రైతు అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. లీఫ్ అనే సంస్థ ద్వారా తాను కొత్త వంగడాలను సాగు చేశానని రైతు తెలిపారు. ఇలాంటి కొత్త విధానాలు, కొత్త వంగడాల సాగుపై రైతులు తెలిపి వారికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్‌రెడ్డి, ఏడీలు కోటేశ్వరావు,రమణారెడ్డి, హెచ్‌ఓ లక్ష్మీప్రసూన, ఆర్‌బీకే సిబ్బంది, రైతు ఉత్పత్తిదారుల సంఘ సీఈఓ హరి, రైతులు బాబు, వేణురెడ్డి, లక్ష్మీపతి, చంద్రారెడ్డి, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకం



సర్పంచ్ రాజారెడ్డికి సర్టిఫికెట్ అందిస్తున్న భాస్కర్‌రెడ్డి, నాగరాజారెడ్డి

పుంగనూరు: గ్రామాభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమని, వారి సేవలు మరువలేమని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి కొనియాడారు. బుధవారం మండల కార్యాలయంలో ఎంపీడీఓ రాజేశ్వరి ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ జిల్లాస్థాయిలో ఏతూరు సర్పంచ్ జయప్రద, మాగాండ్లపల్లె సర్పంచ్ గంగాధర్‌కు అవార్డులు రావడం అభినందనీయమన్నారు. అలాగే మండలంలోని 21 మంది సర్పంచ్‌లకు సర్టిఫికెట్లు అందజేసి సన్మానించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి సహకారంతో అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. 30 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని మండలం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నాలుగేళ్లలో అభివృద్ధి చెందిందని స్పష్టం చేశారు. సమావేశంలో మాజీ ఎంపీపీ నరసింహులు, మాజీ ఏఎంసీ చైర్మన్ నాగరాజారెడ్డి, నాయకులు జయరామిరెడ్డి, చంద్రారెడ్డి యాదవ్, విజయభాస్కర్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ చెంగారెడ్డి, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించరూ!



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు చిట్టిబాబు

కుప్పం రూరల్: బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని అడవిబూదుగూరు పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిట్టిబాబు కోరారు. బుధవారం పాఠశాల ఆవరణలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. నాడు–నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్కూళ్లకంటే మిన్నగా ఉంటున్నాయని, ప్రభుత్వం పిల్లలకు ఉచితంగా యూనిఫాం, పుస్తకాలు ఇవ్వడంతోపాటు మధ్యాహ్న భోజనం పథకం కింద నాణ్యతతో కూడిన ఆహారం పెడుతోందన్నారు. అలాగే అమ్మ ఒడి పథకం గురించి తెలియజేశారు.

చికెన్ వ్యర్థాలను రోడ్డు పక్కన వేస్తే కేసు

చౌడేపల్లి: చికెన్ షాపుల నిర్వాహకులు మాంసం వ్యర్థాలను రోడ్డు పక్కన ఉన్న కాలువులు, చెరువుల్లో పడేయకూడదని, నిబంధనలు అతిక్రమించిన అలా వేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని సర్పంచ్ వరుణ్‌భరత్, పంచాయతీ ఈఓ సుధాకర్‌రావు హెచ్చరించారు. బుధవారం వారు సచివాలయంలో దీనిపై సమీక్షించారు.

పాఠశాలల సామాజిక తనిఖీపై శిక్షణ



మాట్లాడుతున్న ఎంఈఓ లీలారాణి

పలమనేరు: పాఠశాలల సామాజిక తనిఖీపై బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ లీలారాణి, ఎస్ఎస్ఏ కో–ఆర్డినేటర్ అజయ్‌రెడ్డి శిక్షణకు సంబంధించిన అంశాలను విపులీకరించారు. తొలుత సామాజిక తనిఖీకి సంబంధించిన యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు. ఆపై వివరాలను రిజిస్ట్రేషన్ చేసి పాఠశాలలోని మౌలిక సదుపాయాలు, అకడమిక్ డేటాను అందులో అప్‌లోడ్ చేయాలన్నారు. ఇందులో ప్రధానోపాధ్యాయులే కీలకమన్నారు. శిక్షణలో మండలంలోని హెచ్‌ఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఇంటర్‌లో 44 శాతం ఉత్తీర్ణత

సదుం: ఇంటర్ సెకండియర్ ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు 44 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ వెంకటనాథరెడ్డి బుధవారం తెలిపారు. 77 మంది పరీక్షకు హాజరు కాగా 34 మంది ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. సబ్జెక్టుల వారీగా హేమశ్రీ(ఎంపీసీ) 958, సంధ్య (బైపీసీ) 894, దినేష్‌కుమార్(సీఈసీ)801, వినాయక (హెచ్‌ఈసీ) 752 మార్కులతో ప్రథమ స్థానం సాధించారని చెప్పారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే : సీఐ

పుంగనూరు: మద్యం సేవించి వాహనాలు నడిపితే రూ.10 వేలు జరిమానాతో పాటు 7 రోజుల జైలు శిక్ష అనుభవించాలని సీఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మద్యం సేవించడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని, మైనర్లకు వాహనాలు ఇవ్వడం, రహదారులపై బండ్లు పైకి లేపి ఫీట్లు చేయడంతో ప్రమాదాలు అధికమవుతున్నాయని తెలిపారు. వేసవి సెలవుల్లో ఇంటికి తాళాలు వేసుకుని వెళ్లేవారు ముందుగా పోలీసులకు తెలియజేస్తే లాక్డ్ హౌస్ మేనేజ్‌మెంట్ కింద కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో ఎస్‌ఐ మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు మంత్రి పెద్దిరెడ్డి పర్యటన



రాజన్న క్యాంటీన్ ఏర్పాటు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ భరత్



శాంతిపురం : బయటచెరువు వద్ద ప్రారంభానికి సిద్ధమైన ఆర్చి

- పలుచోట్ల ప్రారంభోత్సవాలు, భూమి పూజలు

కుప్పం: రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుప్పం మున్సిపాలిటీ, శాంతిపురం మండలంలో గురువారం పర్యటించనున్నారు. పలుచోట్ల ఆయన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేయనున్నారు. కుప్పం మున్సిపల్ పరిధిలో అల్పాహారానికి సంబంధించి బైపాస్ రోడ్డులోని పూల మార్కెట్ కాంప్లెక్స్ ఎదురుగా, మధ్యాహ్నం పూట భోజనానికి సంబంధించి తిరుపతి గంగమ్మ దేవస్థానం ఎదురుగా రాజన్న క్యాంటీన్లను ఆయన ప్రారంభిస్తారు. కుప్పం వాసులకు ఇక్కడ భోజనం ఉచితం. అంతేకాకుండా మున్సిపల్ నూతన కార్యాలయం, రాధాకృష్ణ రోడ్డులో మున్సిపాలిటీ కాంప్లెక్స్, సింగిల్ విండో భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తారు. అలాగే రూ.20 లక్షలతో నిర్మించిన కుప్పం ప్రెస్‌క్లబ్ భవనాన్ని ప్రారంభిస్తారు. మంత్రి పర్యటనకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎమ్మెల్సీ భరత్ తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ రాజకీయ పరిశీలకులు మొగసాల రెడ్డెప్ప, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిపురం మండలంలో..

శాంతిపురం: మండలంలో గురువారం ఉదయం 10 గంటలకు సొన్నేగానిపల్లె పంచాయతీ సచివాలయం, వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రం భవనాలను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభిస్తారు. తర్వాత కూతేగానిపల్లెను ఆయన సందర్శిస్తారు. కుప్పం మున్సిపాలిటీ పర్యటన అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు దండికుప్పం పంచాయతీలోని బయట చెరువు వద్ద ప్రారంభ ద్వారం(ఆర్చి) ప్రారంభిస్తారు. చొడంపల్లెలో శ్రీ కోదండరామస్వామి ఆలయ కుంభాభిషేకంలో పాల్గొంటారు. ఈ గ్రామంతోపాటు నల్లరాళ్లపల్లెలో నూతన కమ్యూనిటీ భవనాలను, నల్లరాళ్లపల్లెలో నిర్మించిన రచ్చబండను ఆయన ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు కర్లగట్టలోని ద్రౌపదీ సమేత శ్రీ ధర్మరాజులస్వామి గుడిని సందర్శించి మహాభారత ఉత్సవాల్లో మంత్రి పాల్గొంటారు.

నవరత్నాలతోనే రాష్ట్రాభివృద్ధి



వికలాంగుని సమస్యలు ఆలకిస్తున్న ఎమ్మెల్సీ భరత్

కుప్పం రూరల్: నవరత్నాలతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ అన్నారు. బుధవారం మండలంలోని అంబాపురం, లింగాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. 190 ఇళ్లకు వెళ్లి ఆయా కుటుంబాలు పొందిన పథకాల లబ్ధిని సంక్షేమ బావుటా బుక్‌లెట్లతో వివరించారు. అటవీ ప్రాంత గ్రామాలు కావడంతో పలు సమస్యలను గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. స్థానిక అధికారులతో మాట్లాడి పలు సమస్యలను ఎమ్మెల్సీ అక్కడిక్కడే పరిష్కరించారు. జిల్లాస్థాయి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో దూరదృష్టితో పథకాలను అమలు చేస్తున్నారన్నారు.

అటు సంక్షేమం, ఇటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యతనిస్తున్నారని పేర్కొన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనన్నారు. కుప్పం నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేస్తున్నా టీడీపీ నాయకులు అడ్డుకోవడం శోచనీయమని, వారికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. అందరికీ మేలు చేయాలనే ఉద్దేశంతో తాము ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ అశ్విని, జెడ్పీటీసీ ఏడీఎస్ శరవణ, నాయకులు మురుగేష్ పాల్గొన్నారు.

కళ్లు లేని కబోదుల్లా టీడీపీ నేతలు

- మీకు సంక్షేమం, అభివృద్ధి కనిపించడం లేదా?
- రాజంపేట ఎన్నికల పరిశీలకులు, వైఎస్సార్‌సీపీ కార్యదర్శి క్రిష్ణమూర్తి



దేవదొడ్డి వద్ద రహదారిపై మాట్లాడుతున్న రాజంపేట ఎన్నికల పరిశీలకులు బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి

బైరెడ్డిపల్లె: మండలంలో పార్టీలు, కులమతాలకతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నా, అభివృద్ధి పరుగులు తీస్తున్నా టీడీపీ నేతలు కళ్లు లేని కబోదుల్లా నిరసన వ్యక్తం చేయడం సిగ్గుచేటని రాజంపేట ఎన్నికల పరిశీలకులు, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ కార్యదర్శి బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి మండిపడ్డారు. మండలంలోని దేవదొడ్డి– దాసార్లపల్లె రహదారిపై బుధవారం వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, దేవదొడ్డిలో ఈనెల 25న టీడీపీ నేతలు ఇదేం ఖర్మ కార్యక్రమంలో భాగంగా రహదారిపై వరినాట్ల కార్యక్రమం నిర్వహించడంలో ఔచిత్యమేమిటని ప్రశ్నించారు. వాస్తవానికి ఈ మార్గం విస్తరణకు ఎమ్మెల్యే ఎన్.వెంకటేగౌడ విజ్ఞప్తితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.17 కోట్లు నిధులు మంజూరు చేశారని, నెల రోజులుగా ఈ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు.. రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలకు రహదారి అక్కడక్కడా గుంతలు పడి వర్షపు నీరు ఉండడంతో టీడీపీ నాయకులు వరినాట్లకు పూనుకోవడం..పైగా కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్, పెట్రో ధరలను రాష్ట్ర ప్రభుత్వంపై చెబుతూ ప్రజల దృష్టిని మళ్లించేందుకు యత్నించడం సిగ్గుచేటన్నారు.14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు హయాంలో బైరెడ్డిపల్లె మండలంలో ఏ ఒక్క అభివృద్ధి కూడా జరిగిన దాఖలాలు లేవన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో రూ.17 కోట్లతో రహదారులను అభివృద్ధి చేశారని వాటి గురించి వివరించారు. సమావేశంలో పార్టీ నేతలు తబ్రాజ్, ఫైజుల్లా, జయకుమార్, కేశవులు, రవిచంద్ర, ప్రభాకర్‌రెడ్డి, బాలాజీ, మునెప్పగౌడు, సుధాకర్, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

నోరు పారేసుకోవద్దు..

పలమనేరు: పట్టణంలోని టీడీపీ నాయకులు అవాకులు చెవాకులతో నోరు పారేసుకోరాదని వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా విభాగం నాయకులు హితవు పలికారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కౌన్సిలర్లతో కలసి వారు మీడియాతో మాట్లాడారు. మంత్రిగా అమరనాథరెడ్డి ఉన్నప్పుడు పట్టణంలోని రోడ్లకు, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో రోడ్లకు తేడా ఎలా ఉందో టీడీపీ నాయకులు కనపడ లేదా? అని సూటిగా అన్నారు. దళితులకు ఎవరూ ఏమార్చారో..వారికి ఎవరు మేలు చేశారో ప్రజలకు తెలుసన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణ, నాయకులు రహీం ఖాన్, చెంగారెడ్డి, కోదండరామయ్య, మూర్తి, శ్యామ్, శ్యామ్‌సుందర్‌రాజు, గంగమ్మ గుడి చైర్మన్ నరేష్ సోషల్ మీడియాకు చెందిన ముజ్జు, ప్రసాద్‌రెడ్డి, అక్బర్, చందు, షరీఫ్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో ధ్వజారోహణం

- మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలందుకున్న ఆదిశేషుడు

చౌడేపల్లి: స్థానిక శ్రీఅభీష్టద మృత్యుంజయేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో బుధవారం వేదమంత్రోచ్ఛరణ నడుమ ధ్వజారోహణ కార్యక్రమాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఆదిశేషుడుగా పేరొందిన శివపార్వతులకు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ మూర్తులకు రాజశేఖర దీక్షితులు, కుమారస్వామి, మహేష్ ఆధ్వర్యంలో అర్చనలు, అభిషేకాలు చేశారు. తరువాత ఉత్సవ మూర్తులను ప్రత్యేక పూలతో అలంకరించి, మేళతాళాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. ఉభయదారులుగా పద్మశాలి కులస్తులు వ్యవహరించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.అలాగే రాత్రి ఉత్సవమూర్తులు సింహ వాహనంపై విహరిస్తూ ఇంటింటా పూజలందుకున్నారు. విశ్వ బ్రాహ్మణ కులస్తులు ఈ కార్యక్రమం నిర్వహించారు. స్వామివారిని ఎంపీపీ రామమూర్తి, సచివాలయ మండల కన్వీనర్ రుక్మిణమ్మ దర్శించుకున్నారు.



పురవీధుల్లో స్వామివారి ఊరేగింపు

ఘనంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

చౌడేపల్లి: దిగువపల్లె పంచాయతీ మేకలవారిపల్లెలో బుధవారం ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, కలశపూజ, హోమపూజ, మహా మంగళ హారతి, తీర్థప్రసాద వినియోగం కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, నేతలు సోమల మల్లికార్జునరెడ్డి, ఆనందరెడ్డి, రెడ్డెప్పరెడ్డి తదితరులు హాజరయ్యారు. గ్రామస్తులు పెద్దిరెడ్డి, దామోదరరాజును సన్మానించి తీర్థప్రసాదాలను అందజేశారు.